
పెద్దదోర్నాల ఎస్టీ రెసిడెన్షియల్‌ స్కూల్లో గుడ్డు లేకుండా భోజనం చేస్తున్న విద్యార్థులు


దర్శి ఎస్సీ హాస్టల్‌-2 భవనంలోకి వస్తున్న వర్షం నీరు


ఎస్సీ హాస్టల్‌-1లో విద్యార్థుల గదిలోకి వస్తున్న బాత్‌రూమ్‌ నీరు


దర్శి ఎస్సీ హాస్టల్‌-1లో అరకొరగా అందిస్తున్న ఆహారం

సంక్షోభ హాస్టళ్లు

సంక్షేమ హాస్టళ్లు సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతున్నాయి. కూటమి ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి వాటిస్థితి మరింత దారుణంగా తయారైంది. విద్యార్థులు అర్ధాకలితో అలమటిస్తున్నారు. మెనూ సక్రమంగా అమలు చేయక పోవడం విద్యార్థులకు శాపంగా మారింది. ఇరుకు గదుల్లో చలికి వణుకుతూ అల్లాడిపోతున్నారు. కాస్మొటిక్‌ చార్జీలు కూడా సక్రమంగా ఇవ్వడం లేదు. చివరకు బాత్‌రూమ్‌లు సైతం సక్రమంగా లేకపోవడంతో విద్యార్థులు ఆరుబయటే స్నానాలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. తాగే నీరు కూడా సక్రమంగా లేక పోవడంతో అవస్థలు పడుతున్నారు. దర్శి, యర్రగొండపాలెం నియోజకవర్గాల్లోని సాంఘిక సంక్షేమ హాస్టళ్లు, బీసీ హాస్టళ్లలో 'సాక్షి' పరిశీలనలో వెల్లడైన అంశాలపై ప్రత్యేక కథనం..


పుల్లలచెరువు బీసీ హాస్టల్లో మెనూ ఇలా..

- అర్ధాకలితో హాస్టల్‌ విద్యార్థులు
- మెనూకు మంగళం
- బోరు నీరే మహాతీర్థం
- ఆరుబయటే స్నానాలు
- ఇరుకు గదుల్లో విశ్రాంతి

యర్రగొండపాలెం/దర్శి:

ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహించే సాంఘిక సంక్షేమ వసతి గృహాలు అస్తవ్యస్తంగా ఉన్నాయి. ఏ హాస్టల్లో చూసిన సమస్యలు విలయ తాండవం చేస్తున్నాయి. పాడుబడిన గదులు, నేడో రేపో కూలేందుకు సిద్ధంగా ఉన్న ప్రహరీ, ఇరుకు గదుల్లో విశ్రాంతి తీసుకోవాల్సిన పరిస్థితిలో విద్యార్థులు ఉన్నారు. ముఖ్యంగా ప్రభుత్వం నిర్ణయించిన మెనూ కూడా ఆయా హాస్టళ్లల్లో సక్రమంగా అమలు చేయడం లేదు. ఈ కారణంగా విద్యార్థులు అర్ధాకలితో అలమటించాల్సిన పరిస్థితి ఏర్పడింది. నీళ్ల మజ్జిగ, ముద్ద అన్నంలో నీళ్ల చారు పోసుకొని తినాల్సిన పరిస్థితి వారిది. రోజూ వడ్డించాల్సిన కోడిగుడ్డుకు వారంలో కనీసం రెండు పర్యాయాలైనా నామం పెడుతున్నారు. తాగేందుకు నీరు లేక బోరు నీరే తాగుతున్నారు. కొన్ని వసతి గృహాల్లో కప్పుకునేందుకు దుప్పట్లు లేక అల్లాడిపోతున్నారు. వేసవి కాలంలో ఆరుబయట, వర్షాకాలంలో ఇరుకు గదుల్లో నిద్రిస్తున్నారు.

హాస్టళ్లన్నీ అంతే..

యర్రగొండపాలెం నియోజకవర్గంలో మొత్తం 14 సాంఘిక సంక్షేమ హాస్టళ్లు ఉన్నాయి. పుల్లలచెరువు బీసీ హాస్టల్లో మెనూ సక్రమంగా అమలు చేయడం లేదని విద్యార్థులు ఆరోపిస్తున్నారు. పెద్దారవీడు ఎస్సీ హాస్టల్లో 80 మంది విద్యార్థులకు 3 లీటర్ల పెరుగులో నీరు కలిపి సరి చేస్తున్నారు. పెద్దదోర్నాల ఎస్టీ బాలుర రెసిడెన్షియల్‌ పాఠశాలలో ఎవరూ చూడరన్న ఉద్దేశంతో రాత్రి వేళల్లో మెనూ సక్రమంగా అమలు చేయడం లేదు. బెండకాయ కూర, నీళ్ల సాంబారుతోనే విద్యార్థులు సరిపెట్టుకోవాల్సి వస్తోంది.

ఆ భవనం నిర్మించి 35 ఏళ్లు

యర్రగొండపాలెంలో దాదాపు 35 ఏళ్ల క్రితం నిర్మించిన ఎస్సీ హాస్టల్‌ భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరింది. ప్రహరీ కొంతభాగం పూర్తిగా కూలిపోయింది. మరికొంత భాగం కూలేందుకు సిద్ధంగా ఉంది. విద్యార్థులు ఆరుబయటే స్నానాలు చేస్తుంటారు. ఈ వసతి గృహం జాతీయ రహదారి వెంట ఉన్నా ఉన్నతాధికారులు చూసీ చూడనట్లు వెళ్తుంటారు. బీసీ బాలుర హాస్టల్‌ రేకుల షెడ్డును అద్దెకు తీసుకొని నిర్వహిస్తున్నారు. పట్టణంలో కళాశాల ఉమెన్స్‌ హాస్టళ్లు 4, కళాశాల బాయిస్‌ హాస్టల్‌-1 చొప్పున ఉన్నాయి. ఎస్టీ కళాశాల బాలుర వసతి గృహం ఒక రేకుల షెడ్డులో నిర్వహిస్తుండగా కళాశాల బాలికల వసతి గృహాలకు రూ.30 నుంచి రూ.40 వేల వరకు అద్దెలు చెల్లిస్తూ కనీస వసతులు లేని భవనాల్లో నిర్వహిస్తున్నారు.


కూలేందుకు సిద్ధంగా ఉన్న వై.పాలెం ఎస్సీ హాస్టల్‌ ప్రహరీ


శిథిలావస్థకు చేరిన వై.పాలెం ఎస్సీ హాస్టల్‌

మెనూకు మంగళం

దర్శి నియోజకవర్గంలో 15 హాస్టళ్లు ఉన్నాయి. వాటిలో 8 ఎస్సీ, 7 బీసీ హాస్టళ్లు. దర్శిలో 3 ఎస్టీ హాస్టళ్లు, దొనకొండలో 2, కురిచేడు, తాళ్లూరు, ముండ్లమూరు మండలాల్లో ఒక్కో హాస్టల్‌ చొప్పున ఉంది. బీసీ హాస్టళ్లు దర్శిలో 3, దొనకొండ, కురిచేడు, తాళ్లూరుల్లో ఒక్కో హాస్టల్‌ చొప్పున ఉన్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక దర్శిలోని ఎస్సీ హాస్టళ్ల పరిస్థితి మరింత దయనీయంగా తయారైంది. అద్దె భవనాలకు అద్దె చెల్లిస్తున్నా వాటికి తలుపులు, కిటికీలు లేవు. బాత్‌రూమ్‌లు సరిగా లేవు. వర్షం కురిస్తే లోనికి నీరు వస్తుంది. విద్యార్థులకు అందించాల్సిన ఆహారం మెనూకు మంగళం పాడారు.

నిద్రలేని రాత్రుళ్లు గడుపుతున్న విద్యార్థులు

హాస్టళ్లలో కిటికీలు, తలుపులు లేక దోమలు స్వైర విహారం చేస్తున్నాయి. ఫ్యాన్లు లేక ఉక్కపోత మరో వైపు వేధిస్తోంది., చలికాలం వచ్చినా రగ్గులు కూడా సరఫరా చేయక పోవడంతో విద్యార్థులు నిద్రలేని రాత్రుళ్లు గడుపుతూ దయనీయ స్థితిలో మగ్గిపోతున్నారు. మెనూ ప్రకారం ఆహారం పెట్టక పోవడం, కూరలు బదులు నీళ్ల పప్పు, పెరుగు బదులు మజ్జిగ పెడుతున్నారు. రెండు హాస్టళ్లకు ఒక వార్డెన్‌, హాస్టల్‌కు ముగ్గురు వంట పని మనుషులు ఉండాల్సి ఉండగా ఇద్దరు మాత్రమే ఉన్నారు. వంట కూడా వాచ్‌మెన్‌లు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. గతంలో మూడు నుంచి పదో తరగతి విద్యార్థుల ఆహారానికి రూ.1400 మెనూ ఇచ్చారు. ఇంటర్‌, డిగ్రీ విద్యార్థులకు రూ.1600 మెనూ ఇచ్చారు. గత ప్రభుత్వంలో పెంచిన మెనూనే అమలు చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నిత్యావసరాల ధరలు విపరీతంగా పెరిగినా వాటికి అనుగుణంగా విద్యార్థులకు ఇచ్చే పాత రేట్లనే అమలు చేస్తున్నారు. రాత్రి పూట విద్యార్థులు ఫ్యాన్‌లు లేక పోవడంతో భవనాలపైకి వెళ్లి పడుకుంటున్నారు. వర్షం పడితే అందరూ లేచి గదుల్లోకి వెళ్తున్నారు. బాతురూమ్‌ల పరిస్థితి మరింత దయనీయంగా ఉంది. లెట్రిన్‌ల్లో నీరు కూడా కిందకు వెళ్లే పరిస్థితి లేక లోపల ఎలా మలవిసర్జన చేయాలో తెలియక విద్యార్థులు నరక యాతన అనుభవిస్తున్నారు. కడుపునిండా అన్నం పెట్టడం లేదని విద్యార్థులు వాపోతున్నారు. వార్డెన్‌లు సిబ్బంది నియామకాలు లేక పోవడంతో పర్యవేక్షణ లోపించింది.

పెచ్చులూడుతున్న స్లాబ్‌లు

బీసీ హాస్టల్‌ గదులన్నీ కారుతున్నాయి. భవనం శిథిలావస్థకు చేరుకుంది. నిత్యం స్లాబ్‌ పెచ్చులూడి కింద పడుతున్నాయి. ఎత్తు తక్కువలో ఉండటంతో మంచాలు పైకి ఎక్కితే ఫ్యాన్‌లు తగులుతున్నాయి. మంచాల కింద పండుకునే విద్యార్థులకు గాలి ఆడక అల్లాడుతున్నారు. రాత్రి పూట వర్షం కురిస్తే మంచాలను పక్కకు జరుపుకోడమే తప్ప మరో మార్గం లేదు. రగ్గులు, దుప్పట్లు లేవు. బీసీ కళాశాల విద్యార్థులకు మంచాలు లేవు. నేలపైనే పడుకోవాల్సిన దుస్థితి ఏర్పడింది. దొనకొండ బీసీ బాలుర వసతి గృహంలో బాత్‌రూమ్‌లు ఉన్నా నీటి వసతి లేదు. ప్రహరీ నిర్మాణాలు చేయాలని విద్యార్థులు చెప్తున్నారు. కురిచేడు మండలంలో ఒక బీసీ, ఒక ఎస్సీ హాస్టళ్లు ఉన్నాయి. బీసీ హాస్టల్‌ రూమ్‌లోకి నీరు వస్తుంది. గదులు ఎత్తు తక్కువగా ఉనందున మంచాలు వేస్తే పైన ఫ్యాన్‌లు తగులుతున్నాయి. చదువు, తిండి, నిద్ర అన్నీ కిందనే కూర్చుని చేయాల్సిన దుస్థితి ఏర్పడింది. హాస్టల్‌ ప్రహరీ లేక పోవడంతో పశువులు, పాములు వంటి విష సర్పాలు లోనికి వస్తున్నాయి. ముండ్లమూరు మండలం మారెళ్ల ఎస్సీ హాస్టల్లో విద్యార్థులకు మంచాలు లేవు. కిందనే పండుకోవాల్సి వస్తోంది. మెనూ ప్రకారం ఆహారం అందడం లేదు. తాళ్లూరు సాంఘిక సంక్షేమ హాస్టల్‌ ఒకటి మాత్రమే ఉంది. విద్యార్థులకు మంచాలు లేవు. కిందనే పడుకోవాల్సి వస్తోంది. హాస్టల్‌ పొలాల్లో ఉండటంతో ప్రహరీ లేక రాత్రుళ్లు విష సర్పాలు వస్తున్నాయి.


దర్శి ఎస్సీ హాస్టల్‌-2లో కిటికీలు, తలుపులు లేని గదులు


దొనకొండలో అలంకార ప్రాయంగా ఉన్న ఎస్సీ హాస్టల్‌ బాత్‌రూమ్‌లు


ముండ్లమూరు మండలం మారెళ్లలో మంచాలు లేకుండా హాస్టల్‌ గదులు


ఎస్సీ హాస్టల్లో అమలు చేయాల్సిన మెనూ


దర్శి బీసీ కళాశాల హాస్టల్లో నేలపై పడుకున్న విద్యార్థులు


తాళ్లూరులో ప్రహరీ లేని హాస్టల్‌ భవనం


ఎస్సీ హాస్టల్‌-1లో అపరిశుభ్రంగా ఉన్న బాత్‌రూమ్‌

క్లుప్తంగా

నేడు పూర్వ విద్యార్థుల సమ్మేళనం

యర్రగొండపాలెం: స్థానిక ప్రభుత్వ జూనియర్‌ కళాశాలలో చదువుకొని వివిధ ప్రాంతాల్లో ఉద్యోగాలు, వ్యాపారాలు, ఇతర కార్యక్రమాల్లో స్థిరపడిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం స్థానిక ప్రభుత్వ హైస్కూల్‌ ఆడిటోరియంలో ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు యక్కలి భాగ్యారావు, సూరె వెంకటస్వామి తెలిపారు. 1976-78 నుంచి 1980-82 వరకు జూనియర్‌ కళాశాలలో విద్యనభ్యసించిన వారందరూ తమ భాగస్వాములతో పాల్గొంటున్నారని, ఈ సందర్భంగా స్థానిక భారతీయ స్టేట్‌ బ్యాంక్‌ నుంచి పెద్ద ఎత్తున ర్యాలీ ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఉదయం నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరిగే ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు పాల్గొనాలని కోరారు.

ఎన్టీఆర్‌ విగ్రహావిష్కరణ

పెద్దదోర్నాల: మండల కేంద్రం పెద్దదోర్నాల శ్రీశైలం రహదారిలో నూతనంగా ఏర్పాటు చేసిన ఎన్టీఆర్‌ కాంస్య విగ్రహాన్ని రాష్ట్ర మంత్రులు శనివారం ఆవిష్కరించారు. నియోజకవర్గ ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో దేవదాయ శాఖ మంత్రి ఆనం రామ నారాయణరెడ్డి, విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్‌, సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్‌ డోలా బాలవీరాంజనేయస్వామి, ఒంగోలు పార్లమెంట్‌ సభ్యుడు మాగుంట శ్రీనివాసరెడ్డితో పాటు పలువురు ఎమ్మెల్యేలు ఎన్టీఆర్‌ విగ్రహావిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్నారు.

తాళ్లూరు తహసీల్దార్‌గా రమణారావు

తాళ్లూరు: స్థానిక తహసీల్దార్‌గా బచ్చల వెంకట రమణారావు శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన పామూరు తహసీల్దార్‌గా పని చేస్తూ సెలవులో ఉన్నారు. సెలవుల అనంతరం ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఇప్పటి వరకు ఇన్‌చార్జి తహసీల్దార్‌గా ముండ్లమూరు తహసీల్దార్‌ లక్ష్మీనారాయణ ఉన్నారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన తహసీల్దార్‌కు రెవెన్యూ అధికారులు, సిబ్బంది పుష్పగుచ్ఛాలు ఇచ్చి స్వాగతం పలికారు. రైతులకు నిత్యం అందుబాటులో ఉండి సేవలు అందిస్తానని తహసీల్దార్‌ వెంకట రమణారావు తెలిపారు.

రోడ్డుపై వర్షం నీరు


తారు రోడ్డుపై చేరిన వర్షం నీరు

- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు

యర్రగొండపాలెం: స్థానిక కొలుకుల రోడ్డుపై వర్షం నీరు చేరడంతో వాహనదారులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. పట్టణ శివారులో ఉన్న తారు రోడ్డు నుంచి పందివానిపల్లె, వీరభద్రాపురం, మొగుళ్లపల్లి, వెంకటాద్రిపాలెం, గంజివారిపల్లె, కొలుకుల, గుర్రపుశాల ప్రాంతాల నుంచి వందల సఖ్యలో వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. నీరు చేరడంతో ఎప్పుడు ఎటువంటి ప్రమాదం జరుగుతుందోనన్న అనుమానంతో వాహనాలు నడుపుకోవాల్సి వస్తోందని వాహన యజమానులు తెలిపారు. ద్విచక్ర వాహనాలతో పాటు ఆటోలు, లారీలు, వ్యాన్‌లు ఈ రోడ్డుపై రాకపోకలు సాగిస్తుండటంతో మురుగు నీరు నిల్వ చేరి దోమలకు ఆవాసాలుగా మరిందని ఆ ప్రాంత ప్రజలు తెలిపారు. చిన్నపాటి వర్షం కురిసి రోడ్డుపై చేరిన నీరు దాదాపు నెల రోజుల వరకు నిల్వ ఉంటుందని తెలిపారు. రోడ్డు మార్జిన్‌లో కాలువలు తీస్తే ఇబ్బందులు ఉండవాని చెబుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి రోడ్డుపై నీరు నిల్వ చేరకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

వైఎస్సార్‌ సీపీ కార్యకర్తలు తరలి రావాలి


జెడ్పీటీసీ నాగిరెడ్డి

కురిచేడు: బాబు ష్యూరిటీ..మోసం గ్యారెంటీ పేరుతో ఈ నెల 30వ తేదీ బుధవారం ఉదయం 10 గంటలకు స్థానిక దర్శి రోడ్‌లోని గుంటక నాసర్‌రెడ్డి కళ్యాణ మండపంలో నిర్వహిస్తున్న సమావేశానికి వైఎస్సార్‌ సీపీ కార్యకర్తలు, నాయకులు భారీగా తరలి రావాలని జెడ్పీటీసీ నుసుం వెంకట నాగిరెడ్డి పిలుపునిచ్చారు. మండల స్థాయి వైఎస్సార్‌ కాంగ్రెస్‌ పార్టీ కార్యకర్తల విస్తృత సమావేశానికి జిల్లా పరిషత్‌ చైర్మన్‌ బూచేపల్లి వెంకాయమ్మ, వైఎస్సార్‌ కాంగ్రెస్‌ పార్టీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే డాక్టర్‌ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి హాజరవుతారని పేర్కొన్నారు. కార్యక్రమానికి మండలం నుంచి పార్టీ రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ స్థాయి నాయకులు, మండల కమిటీ సభ్యులు, అనుబంధ విభాగాల అధ్యక్షులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు.

తిరుమలనాథస్వామికి ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో తిరుమలనాథస్వామి

పెద్దారవీడు: మండల పరిధిలోని చట్లమిట్ల పంచాయతీ రాజంపల్లి సమీపంలో వెలసిన శ్రీ రాజ్యలక్ష్మి సమేత గొడ్రాలికొండ తిరుమలనాథ స్వామికి శనివారం భక్తులు భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. ఆలయ అర్చకులు భవానీప్రసాద్‌ ఆధ్వర్యంలో స్వామి, అమ్మవార్లకు అర్చనలు, అభిషేకాలు, విశేష పూజలు చేశారు. అనంతరం పట్టువస్త్రాలు, అభరణాలు, పూలమాలతో ప్రత్యేకంగా అలంకరించారు. అమ్మవారి ఎదుట శ్రీచక్రం వద్ద దంపతులు కుంకుమార్చన చేశారు. వివిధ గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకొని కాయకర్పూరం సమర్పించి మొక్కులు చెల్లించి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

యువకుడు ఆత్మహత్యాయత్నం


ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న నిరీక్షన్‌

దర్శి: మండలంలోని తూర్పు వెంకటాపురం గ్రామానికి చెందిన గంగవరపు నిరీక్షన్‌ అనే యువకుడు ఇంట్లో ఎవరూ లేని సమయంలో చున్నీతో ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్యకు ప్రయత్నించాడు. ఈ సంఘటన శనివారం జరిగింది. వెంటనే గమనించిన కుటుంబ సభ్యులు చున్నీని తొలగించి 108లో స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో అక్కడి నుంచి ఒంగోలు రిమ్స్‌కు రిఫర్‌ చేశారు. శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది పడుతున్న యువకుడిని 108 సిబ్బంది వాహనంలో తీసుకుని వెళ్తూనే వైద్యులు సాయికృష్ణకు ఫోన్‌ చేసి ఆయన ఇచ్చిన సలహాలు సూచనలు మేరకు కృత్రిమ ఆక్సిజన్‌ ఇస్తూ ప్రథమ చికిత్స చేస్తూ రిమ్స్‌లో చేర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. ఈఎంటీ ప్రసాద్‌, పైలట్‌ వెంకటేశ్వర్లును కుటుంబ సభ్యులు, ఆపరేషన్‌ ఎగ్జిక్యూటివ్‌ మహేష్‌, డిస్ట్రిక్ట్‌ మేనేజర్‌ విజయ్‌కుమార్‌ అభినందించారు.

నిరుపేదలను ఆదుకోవాలి


మాట్లాడుతున్న ఏపీఎం దేవరాజు

తాళ్లూరు: నిరుపేదలను ఆదుకోవాలని సర్పంచ్‌ వలి, ఏపీఎం దేవరాజు అన్నారు. మండలంలోని మల్కాపురంలో శనివారం అధికారులు పి-4 సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో ఉన్న నిరుపేదలకు ప్రభుత్వం తన సహకారం అందిస్తోందని చెప్పారు. ప్రభుత్వంతో పాటు సంపన్నులు కూడా సాయం చేయాలని కోరారు.

కార్యకర్తలతో ఎమ్మెల్యే తాటిపర్తి చిట్‌చాట్‌


ఎమ్మెల్యే తాటిపర్తితో పార్టీ కార్యకర్తలు, రైతులు

పెద్దారవీడు: యర్రగొండపాలెం నుంచి దోర్నాల మండలం యడవల్లిలో జరిగే ఓ కార్యక్రమానికి వెళ్తూ మార్గమధ్యంలో శనివారం సాయంత్రం మండలంలోని మద్దలకట్టలో వైఎస్సార్‌ సీపీ నాయకులు, కార్యర్తలు కనిపించడంతో ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్‌ కొద్దిసేపు ఆగి మాట్లాడారు. బస్టాండ్‌ వద్ద కార్యకర్తలు కనిపించడంతో వెంటనే కారు నుంచి దిగి వారి మధ్యలో కుర్చొని టీ తాగుతూ ప్రతి ఒక్కరినీ పేరు పేరునా పలకరించారు. వ్యవసాయం, పంటల పరిస్థితులు, పొగాకు, మిర్చి గిట్టుబాటు ధరలపై రైతుతో మాట్లాడారు. పార్టీ గ్రామ అధ్యక్షుడు మూల రమణారెడ్డి, పార్టీ ఉపాధ్యక్షుడు ఒంటేరు చిన్నరాజులు, నాయకులు ఏర్వ శ్రీనివాసరెడ్డి, దొడ్డా సుబ్బారెడ్డి, మూల వెంకటరెడ్డి, మూల శ్రీనివాసరెడ్డి, తంగిరాల పోలయ్య, దర్శనం యోబు, దొడ్డా కేశవరెడ్డి, జడ్డా రాజు ఉన్నారు.

నిత్యాన్నదానానికి రూ.1.56 లక్షల విరాళం


దాతలకు అమ్మవారి చిత్రపటం అందజేస్తున్న ఆలయ అధికారి

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మ సన్నిధిలో జరుగుతున్న నిత్యాన్నదానానికి ప్రకాశం జిల్లాకు చెందిన భక్తులు శనివారం రూ.1.56 లక్షల విరాళం సమర్పించారు. గిద్దలూరుకు చెందిన ఏదూరి శ్రీనివాసరెడ్డి కుటుంబం అమ్మవారిని దర్శించుకునేందుకు ఇంద్రకీలాద్రికి విచ్చేసింది. ఆలయ అధికారులను కలిసి నిత్యాన్నదానానికి విరాళం అందజేసింది. అనంతరం దాతలకు ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం కల్పించారు. వేద పండితుల ఆశీర్వచనం అనంతరం దాతలకు ఆలయ అధికారి అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు, శేషవస్త్రాలు అందజేశారు.

ఆర్‌టీఐ చట్టంపై అవగాహన ఉండాలి


ఆర్టీఐ చట్టంపై అవగాహన కల్పిస్తున్న అధ్యాపకులు

దర్శి: ఆర్టీఐ చట్టంపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌ డాక్టర్‌ కె.ప్రభుదాస్‌ సూచించారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కాలజీయేట్‌ ఆఫ్‌ కమిషనరేట్‌ ఉత్తర్వుల మేరకు ఆర్టీఐ చట్టం ఏర్పడి 20 ఏళ్లు పూర్తయిన సందర్భంగా కళాశాలలో విద్యార్థులకు వ్యాసరచన, క్విజ్‌, డిబేట్‌ పోటీలు నిర్వహించారు. ప్రభుదాస్‌ మాట్లాడుతూ విద్యార్థుల్లో ప్రతిభను వెలికి తీయడం, సమాజంపై అవగాహన, చట్టాలపై అవగాహన కల్పించడంలో భాగంగా పోటీలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. విజేతలైన విద్యార్థులను ఆగస్టు ఒకటో తేదీన ఒంగోలు ప్రభుత్వ మహిళా కళాశాలలో జరిగే జిల్లా స్థాయి పోటీలకు పంపనున్నట్లు పేర్కొన్నారు. అక్కడ విజేతలైన వారిని గుంటూరులో రాష్ట్ర స్థాయిలో జరిగే పోటీలకు పంపుతామన్నారు. కార్యక్రమంలో ఇంగ్లిష్‌ లెక్చరర్‌ డాక్టర్‌ ఏ.నగేష్‌, తెలుగు లెక్చరర్‌ డాక్టర్‌ గంథం వేణు, బోటనీ లెక్చరర్‌ డాక్టర్‌ రమణ, ఫిజిక్స్‌ లెక్చరర్‌ డాక్టర్‌ కె.నరేష్‌, కెమిస్ట్రీ లెక్చరర్‌ రామచంద్రయ్య, కామర్స్‌ లెక్చరర్‌ రమణ, విద్యార్థులు, పాల్గొన్నారు.